SUN - M U_SAT - M U.qxd 10-12-2023 11:06 PM Page 1

మార్పు కోసం ...

# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

ప్రచురణ : హైదరాబాద్, ఖమ్మం, అమరావతి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి/ చీఫ్ ఎడిటర్ : జి. శ్రీధర్ /సంపుటి :5 సంచిక 138/ 11 సోమవారం, డిసెంబర్ 2023 పేజీలు: 4/వెల రూ5/-

విలేకరులు కావలెను

హైదరాబాద్, అమరావతి
కేంద్రాలుగా
నడుపబడుతున్న
మరో ఉదయం
(అక్రిడేషన్ కలిగి ఉన్న)
తెలుగు దినపత్రికకు తెలంగాణ
ఆంధ్ర ప్రదేశ్ లలోని అన్ని జిల్లాలకు
ఇన్చార్జులు, నియోజకవర్గం మండలాలకు
విలేకరులు కావలెను

మరిన్ని వివరాలకు సంపాదించండి
సెల్:9154842842

# రాష్ట్రంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్ల నియామకం

# రద్దు

- తెలంగాణలో కొలువుదీరిన కాంగ్రెస్ సర్కారు
- తనదైన మార్కు పాలనతో దూసుకెళుతున్న రేవంత్
- తాజాగా 54 కార్పొరేషన్ల చైర్మన్ల నియామకం రద్దు
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ శాంతికుమారి

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించగా, ఇప్పుడు రేవంత్ రెడ్డి సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 54 కార్పొరేషన్ల చైర్మన్ల నియామకాలను రద్దు చేసింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ ప్రభుత్వ తాజా నిర్ణయంతో పదవులు కోల్పోయిన వారిలో ఆకుల లలిత, అల్లం నారాయణ, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, గెల్లు శ్రీనివాస్, జూలూరి గౌరీశంకర్, తాటికొండ రాజయ్య, సోమా భరత్ కుమార్, పల్లె రవికుమార్ తదిరులు ఉన్నారు. త్వరలోనే ఆయా కార్పొరేషన్లకు చైర్మన్లు, చైర్ పర్సన్లను నియమించే అవకాశాలున్నాయి.



# హరీశ్ రావుపై మంత్రి కోమటిరెడ్డి ఆగ్రహం..

## తప్పులు చేసిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరిక

**మంత్రిగా బాధ్యతలను స్వీకరించిన కోమటిరెడ్డి**

**తొమ్మిది ఫైళ్లపై సంతకాలు చేసిన మంత్రి**

**రెండు రోజులకే కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ విమర్శలు గుప్పిస్తున్నారని మండిపాటు**



తెలంగాణ మంత్రిగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి బాధ్యతలను స్వీకరించారు. ఆర్ అండ్ బీ, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రిగా సచివాలయంలోని తన ఛాంబర్ లో బాధ్యతలను చేపట్టారు. సచివాలయంలోని 5వ అంతస్తులోని 11వ ఛాంబర్ లో బాధ్యతలను స్వీకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మంత్రిగా తన ఛైర్ లో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబసభ్యులు, సోదరుడు, ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, అధికారులు పాల్గొన్నారు. మంత్రిగా బాధ్యతలను స్వీకరించిన వెంటనే కొన్ని ఫైళ్లపై సంతకం చేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ... మంత్రిగా బాధ్యతలను చేపట్టిన వెంటనే 9 ఫైల్స్ పై సంతకాలు చేశానని చెప్పారు. తనకు ఆర్ అండ్ బీ శాఖను కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ కు ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. అసెంబ్లీ ఆవరణలో కొత్త కౌన్సిల్ హాల్ ను నిర్మించనున్నామని... ఆ బాధ్యతను ముఖ్యమంత్రి తనకు అప్పగించారని చెప్పారు. అసెంబ్లీలో గాంధీ విగ్రహం ముందున్న ఫెన్సింగ్ ను తీసేసి సుందరీకరణ పనులు చేపడతామని తెలిపారు. తన నియోజకవర్గం పరిధిలోని రోడ్లను రూ. 100 కోట్ల వ్యయంతో నాలుగు లైన్ల రోడ్లుగా మారుస్తామని చెప్పారు. తాను ఢిల్లీకి వెళ్తున్నానని... 14 రోడ్లను నేషనల్ హైవేలుగా గుర్తించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరుతానని కోమటిరెడ్డి తెలిపారు. ఎల్బీ నగర్ నుంచి మల్కాపురం వరకు, మల్కాపురం నుంచి సూర్యాపేట వరకు 6 లైన్ల రోడ్డు పనులు చేయాల్సి ఉందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజుల్లోనే... ఏం చేశారంటూ మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పదేళ్లుగా బీఆర్ఎస్ పార్టీ చేసిందేముందని ప్రశ్నించారు. రహదారులపై శ్రద్ధ పెట్టలేదని దుయ్యబట్టారు. తాము ఎవరి మీద కక్ష సాధింపులకు పాల్పడమని... తప్పులు ఉంటే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని చెప్పారు.

## కొంచెం మానవత్వం చూపండి జగన్ గారూ... మాటల్లో కాదు చేతల్లో!: చంద్రబాబు

**అనంతపురం జిల్లాలో అంధురాలి ఆత్మహత్య**

**పింఛను నిలిపివేశారంటూ పురుగు మందు తాగిన వైనం**

**ఆంక్షల పేరుతో అంధురాలి పెన్షన్ తొలగింపు కర్కశత్వం అని పేర్కొన్న చంద్రబాబు**



అనంతపురం జిల్లాలో నక్కదొడ్డి తండాకు చెందిన సరోజమ్మ (40) అనే అంధురాలు పింఛను తొలగించారంటూ మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె తమ్ముడికి రైల్వే ఉద్యోగం వచ్చినందున ప్రభుత్వం ఆమె పింఛను నిలిపివేసినట్టు ఓ పత్రికలో కథనం వచ్చింది. దీనిపై టీడీపీ అధినేత చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. "కొంచెం మానవత్వం చూపండి జగన్ గారూ... మాటల్లో కాదు చేతల్లో" అంటూ విజ్ఞప్తి చేశారు. ఆంక్షల పేరుతో అంధురాలి పెన్షన్ తొలగించడం కర్కశత్వం అని చంద్రబాబు విమర్శించారు. ఆమె ఆత్మహత్య అత్యంత హృదయ విదారకరం అని పేర్కొన్నారు. ఈ మేరకు సరోజమ్మ ఆత్మహత్య వార్త తాలూకు క్లిప్పింగ్ ను కూడా చంద్రబాబు తన ట్వీట్ లో పంచుకున్నారు.

## రెండ్రోజుల్లో రెండు గ్యారెంటీలు అమలు చేశాం... బీఆర్ఎస్ నేతలు ఇప్పుడేమంటారు?: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- ఖమ్మం వచ్చిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- భట్టి, తుమ్మల, పొంగులేటిలకు ఖమ్మంలో ఘనస్వాగతం
- తాము గ్యారెంటీలను అమలు చేయడం బీఆర్ఎస్ నేతలకు చెంప పెట్టు వంటిదన్న భట్టి
- మిగిలిన 4 గ్యారెంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని స్పష్టీకరణ

2 లో



# చీకట్లో శ్రీలంక..

## దేశ వ్యాప్తంగా ఆగిపోయిన విద్యుత్ సరఫరా

- సాంకేతిక సమస్యతో ఆగిన విద్యుత్ సరఫరా
- దారుణంగా ఆసుపత్రుల్లోని రోగుల పరిస్థితి
- ఏడాది కాలంగా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న శ్రీలంక



తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన శ్రీలంకను విద్యుత్ సమస్య కూడా వేధిస్తోంది. తాజాగా సాంకేతిక సమస్య తలెత్తడంతో దేశ వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నామని సిలోన్ ఎలెక్ట్రిసిటీ బోర్డు అధికార ప్రతినిధి తెలిపారు. కాట్ మలే - బియగమా మధ్య ప్రధాన విద్యుత్ లైనులో సమస్య ఏర్పడటంతో దేశ వ్యాప్తంగా విద్యుత్ నిలిచిపోయింది. విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో ఇంటర్నెట్ సేవలు కూడా నిలిచిపోయాయి. గత ఏడాదిగా శ్రీలంక తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఆహారం, ఇంధనం, ఔషధాలు ఇలా అన్నింటికీ కొరత ఏర్పడింది. దేశంలో విద్యుత్ కోతలు కూడా కామన్ అయిపోయాయి. ప్రతి రోజూ 10 గంటల సేపు విద్యుత్ సరఫరాలో కోత విధిస్తున్నారు. ఇప్పుడు విద్యుత్ సరఫరా పూర్తిగా ఆగిపోవడంతో... ఆసుపత్రుల్లో రోగుల పరిస్థితి కూడా దారుణంగా ఉంది.

# కేసీఆర్ కోలుకుంటున్నారు..

## అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనాలని కోరాను: రేవంత్ రెడ్డి



- యశోదా ఆసుపత్రిలో కేసీఆర్ ను పరామర్శించిన రేవంత్ రెడ్డి
- మంచి పాలన కోసం కేసీఆర్ సూచనలు అవసరమన్న రేవంత్
- ప్రజల పక్షాన అసెంబ్లీలో కేసీఆర్ మాట్లాడాల్సిన అవసరం ఉందన్న సీఎం

2 లో



# ఇతడే నా రాజకీయ వారసుడు: మాయావతి కీలక ప్రకటన

**కీలక ప్రకటన చేసిన బీఎస్పీ అధినేత్రి**

**తన తర్వాత పగ్గాలు అందుకునేది తన మేనల్లుడేనని వెల్లడి**

**ఇప్పటికే సోదరుడికి పార్టీ జాతీయ ఉపాధ్యక్ష పదవి ఇచ్చిన మాయావతి**

బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి తన రాజకీయ వారసుడ్ని ప్రకటించారు. తన రాజకీయ వారసత్వాన్ని మేనల్లుడు ఆకాశ్ ఆనంద్ కొనసాగిస్తాడని వెల్లడించారు. లక్నోలో ఇవాళ జరిగిన బీఎస్పీ కార్యవర్గ సమావేశంలో మాయావతి ఈ ప్రకటన చేశారు. ఆకాశ్ ఆనంద్ వయసు 28 ఏళ్లు. 2017 యూపీ ఎన్నికలు, 2019 లోక్ సభ ఎన్నికల్లో మాయావతి ప్రచారం సాగిస్తున్న వేల ఆకాశ్ ఆనంద్ కూడా ఆమె వెన్నంటే ఉన్నారు. వారసత్వ రాజకీయాలను నిశితంగా విమర్శించే మాయావతి... 2019లో తన సోదరుడు ఆనంద్ కుమార్ ను పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడిగా ప్రకటించడం, ఇప్పుడు మేనల్లుడికి పార్టీ పగ్గాలు అప్పగించబోతున్నట్టు పరోక్షంగా సంకేతాలు ఇవ్వడం చూస్తుంటే విమర్శలు వచ్చే అవకాశం కనిపిస్తోంది.



# కాంగ్రెస్ పార్టీ ఎలాంటిదో చెప్పడానికి ఇదొక ఉదాహరణ: కిషన్ రెడ్డి

**కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్**

**కర్ణాటకలో ఆర్నెల్లు కాకముందే కాంగ్రెస్ అవినీతి షురూ చేసిందన్న కిషన్ రెడ్డి**

**కర్ణాటకలో ఓ నేత నుంచి తెలంగాణకు భారీగా డబ్బు తరలించారని ఆరోపణ**



తెలంగాణ బీజేపీ చీఫ్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీపై ధ్వజమెత్తారు. ఎక్కడ కాంగ్రెస్ ఉంటే అక్కడ అవినీతి విజృంభిస్తుందని, దేశ ఆర్థిక వ్యవస్థను కాంగ్రెస్ పార్టీ చెదలు పట్టినట్టుగా తొలుస్తుందని విమర్శించారు. కర్ణాటకలో అధికారం పీఠం ఎక్కి ఆర్నెల్లు కూడా కాకముందే కాంగ్రెస్ అవినీతికి తెరలేపిందని అన్నారు. ఈ దోపిడీకి భయపడి కర్ణాటకలోని బిల్డర్లు పొరుగు రాష్ట్రాలకు పారిపోతున్నారని, కాంగ్రెస్ పాలన ఎలా ఉంటుందో చెప్పడానికి ఇదొక ఉదాహరణ అని వివరించారు. కర్ణాటకలో కాంగ్రెస్ ను గెలిపించినందుకు ప్రజలు ఇప్పుడు తలపట్టుకుంటున్నారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఝార్ఖండ్ లో కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహు నివాసంపై ఐటీ దాడులు జరిగితే రూ.290 కోట్లు దొరికాయని, అవినీతికి పాల్పడే సీఎంలను, ఎంపీలను కాంగ్రెస్ పార్టీ ఏటీఎంలుగా మార్చుకుంటుందని విమర్శించారు. ఇటీవల కర్ణాటక నుంచి భారీ ఎత్తున తెలంగాణకు తరలించిన డబ్బు పట్టుబడిందని తెలిపారు. ధీరజ్ సాహు తరహాలోనే కర్ణాటకలోని ఓ నేత నుంచి ఈ డబ్బు తరలించారని కిషన్ రెడ్డి ఆరోపించారు. త్వరలో పార్లమెంటు ఎన్నికలు రానున్నాయని, కాంగ్రెస్ కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు

SUN - M U_SAT - M U.qxd 10-12-2023 11:06 PM Page 2



మార్పు కోసం ... మరో ఉదయం

మొదటి పేజీ తరువాయి

# రెండ్రోజుల్లో రెండు గ్యారెంటీలు అమలు చేశాం...

## బీఆర్ఎస్ నేతలు ఇప్పుడేమంటారు?: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో కలిసి ఖమ్మంలో సందడి చేశారు. మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రెండ్రోజుల్లోనే రెండు గ్యారెంటీలను అమలు చేసిందని చెప్పారు. ఎన్నికల ముందు చెప్పిన ప్రకారం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం కల్పించామని, ఆరోగ్య శ్రీ మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచామని భట్టి వివరించారు. ఈ రెండు గ్యారెంటీలను తాము అధికారంలోకి వచ్చిన రెండ్రోజుల్లోనే అమలు చేయడం బీఆర్ఎస్ నేతలకు చెంప పెట్టు వంటిదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ గ్యారెంటీలకు వారంటీ లేదన్న బీఆర్ఎస్ నేతలు ఇప్పుడేం సమాధానం చెబుతారని భట్టి నిలదీశారు. మిగిలిన గ్యారెంటీలను 100 రోజుల్లోగా అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తుందని అన్నారు. తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం సంపద సృష్టించి, ప్రజలకు పంపిణీ చేయడమేనని పేర్కొన్నారు. ఇళ్ల స్థలాలు, పోడు భూముల అంశాలను కూడా వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని భట్టి విక్రమార్క చెప్పారు.

# తెలంగాణ ఓటర్లు కాంగ్రెస్ ను చూసి ఓటేయలేదు

తెలంగాణ ఎన్నికల ఫలితంపై ప్రశాంత్ కిశోర్ ఆసక్తికర విశ్లేషణ

ఇటీవల తెలంగాణ, రాజస్థాన్, చత్తీస్ గఢ్, మధ్యప్రదేశ్, మిజోరంలో ఎన్నికలు

తెలంగాణలో కాంగ్రెస్ విజయం

బీఆర్ఎస్ పై వ్యతిరేకత వల్లే కాంగ్రెస్ గెలిచిందన్న ప్రశాంత్ కిశోర్



ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలపై ప్రముఖ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ స్పందించారు. తెలంగాణలో కాంగ్రెస్ గెలిచిందని చెప్పడం కంటే బీఆర్ఎస్ ఓడిందని చెబితేనే బాగుంటుందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పై ఉన్న వ్యతిరేకతే వారిని ఓడించిందని అభిప్రాయపడ్డారు. ఇటీవల ఎన్నికలు జరిగిన మధ్య ప్రదేశ్ మినహా తెలంగాణ, చత్తీస్ గఢ్, రాజస్థాన్, మిజోరం రాష్ట్రాల్లో ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉందని, ఇతర పార్టీల గెలుపునకు కారణమైందని ప్రశాంత్ కిశోర్ విశ్లేషించారు. మధ్యప్రదేశ్ లో బీజేపీ అధికారం నిలబెట్టుకోగా... తెలంగాణలో కాంగ్రెస్ గెలిచింది. చత్తీస్ గఢ్, రాజస్థాన్ లో బీజేపీ విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. మిజోరంలో స్థానిక పార్టీల కూటమి జెడ్ పీఎమ్ నెగ్గింది. ఈ నేపథ్యంలో ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ తన సొంత బలంతో గెలవలేదని, తెలంగాణ ఓటర్లు కాంగ్రెస్ పార్టీని బీఆర్ఎస్ కు ప్రత్యామ్నాయం అని భావించి ఓటేశారని, కాంగ్రెస్ విజయానికి ఇదే కారణం అని ప్రశాంత్ కిశోర్ వివరించారు. అంతే తప్ప కాంగ్రెస్ ను చూసి ఎవరూ ఓటు వేయలేదని తెలిపారు. అటు, బీజేపీ విజయాలకు కారణం ఆ పార్టీ హిందుత్వ విధానాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడమేనని అభిప్రాయపడ్డారు.

# కార్మికుల హక్కుల కోసం పోరాడే సీఐటీయూ ను గెలిపించండి

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు

ఇల్లందు మరో ఉదయం ప్రతినిధి



టేకులపల్లి మండలంలోని కోయగూడెం ఓపెన్ కాస్ట్ లో సింగరేణి కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్న సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ను ఈసారి ఎన్నికల్లో గెలిపించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు కార్మికులకు విజ్ఞప్తి చేశారు, ఆదివారం కోయగూడెం ఓసి లో అబ్బాస్ అద్యక్షతన జరిగిన ఫిట్ మీటింగ్ లో మాట్లాడుతూ జెబిసిసిఐ నిర్ణయాలు సింగరేణి లో అమలు చేయుటకు కృషి చేశామని అన్నారు, మిగతా సంఘాలు వారి ప్రయోజనాలు తప్ప కార్మికుల ప్రయోజనాల కోసం పట్టించుకోవడం లేదన్నారు, అలాంటి సంఘాలకు ఓట్లు వేయవద్దని అన్నారు, సింగరేణి సంస్థ కి చెందిన భూములు,క్వార్టర్లు కార్మికుల సొంతింటి కలను సాకారం చేయడానికి ఉ పయోగించాలని కోరారు, గత బిఆర్ఎస్ ప్రభుత్వం 2200కోట్ల రూపాయలు సింగరేణి డబ్బులు వాడుకుందని ఆ డబ్బు తిరిగి సింగరేణి సంస్థ కి ఇవ్వాలని డిమాండ్ చేశారు, గుర్తింపు సంఘాల పేరుతో పైరవీలు చేస్తూ డబ్బు దండుకుంటున్నారని విమర్శించారు, సింగరేణి కార్మికులకు మెరుగైన వైద్యం అందించే విధంగా, ఆసుపత్రులలో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు, కార్పోరేట్ ఆసుపత్రుల చేతిలో కార్మికులు బలి అవుతున్నారని అన్నారు, నూతన బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ ఆపాలని, సింగరేణి సంస్థ కే ఇవ్వాలని డిమాండ్ చేశారు, బొగ్గు వెలికితీసే పనులు ప్రైవేటు కంపెనీలకు ఇవ్వవద్దని డిమాండ్ చేశారు,ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితుల సంఘం జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ ఏ నబి, ఎండీ అబ్బాస్,కె.క్రిష్టారెడ్డి, తాళ్లూరి క్రిష్ణ గుగులోత్ చందర్, ఈసం నర్సింహారావు,కుంజ రమేష్, పూనెం సురేష్, తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శివకుమార్ మాదిగ ఆధ్వర్యంలో నూతన కమిటీ నియామకం

మరో ఉదయం/జవహర్ నగర్.



జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పదహారవ డివిజన్, సి ఆర్ పి ఎఫ్ అరుంధతి నగర్ లో ఎమ్మార్పీఎస్ గ్రామ మాదిగ మహిళ సమాఖ్య కమిటీ నియామకం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శివకుమార్ మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో విద్యావంతులైన విద్యార్థులు మరియు యువకులతో కూడిన కమిటీలు నియమిస్తామని, నూతనతరం మాదిగ యువకులలో చైతన్యాన్ని నింపి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధించుకునేంతవరకు పోరాటం చేస్తామని అన్నారు. అదేవిధంగా మహిళలను కూడా చైతన్యం చేసి వారికి కూడా సముచిత స్థానం కల్పించి మాదిగ మహిళా సమాఖ్య కమిటీ కూడా నియమించడం జరిగింది. కమిటీ అధ్యక్షులుగా మల్లారపు పరమేష్ మాదిగ,ఉపాధ్యక్షులు మేదరి మనోజ్ కుమార్ మాదిగ, కాంపెల్లి ప్రశాంత్ మాదిగ ప్రధాన కార్యదర్శి కొంగర విక్రమ్ మాదిగ జాయింట్ కార్యదర్శి కొర్లపాటి నవ్యరాజ్ మాదిగ,కోశాధికారి కొత్త పవన్ కళ్యాణ్ మాదిగ,ప్రచార కార్యదర్శులు బొద్దుల బ్యాండ్ రాజ్ మాదిగ, కాంపెల్లి భాను ప్రకాష్ మాదిగ,సహాయ కార్యదర్శిలు జంగం ప్రవీణ్ మాదిగ, నల్లగండ్ల దేవరాజ్ మాదిగ, కార్యదర్శులు కొర్లపాటి ఉదయరాజు మాదిగ, కట్ట చందు మాదిగలను నియమించడం జరిగింది. మాదిగ మహిళా సమాఖ్య కమిటీ అధ్యక్షురాలు కనకాల భాగ్యలక్ష్మి మాదిగ,ఉ పాధ్యక్షురాలు రమాబాయి బావే మహారాష్ట్ర మాదిగ, ఎర్రోళ్ల శ్రీలత మాదిగ, ప్రధాన కార్యదర్శి నల్లగండ్ల కిష్టమ్మ మాదిగ, కోశాధికారి ఆయుర్వం కమల్ మాదిగ, జాయింట్ కార్యదర్శి మల్లారపు రాజేశ్వరి మాదిగ, ప్రచార కార్యదర్శులు బొట్టుకు ప్రమీల మాదిగ, పడిశాల ధనమ్మ మాదిగసహాయ కార్యదర్శిలు కమిడే మీనా మహారాష్టమాదిగ, కాంపెల్లి నర్మదా మాదిగ కార్యవర్గ సభ్యురాలుగా దొడ్ల రేవతి మాదిగ,దబ్బెట మంజుల మాదిగలు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో కొత్త అజయ్ మాదిగ, కిష్టాపురం బాలరాజు మాదిగ, కోస్గి శివకేశవ్ మాదిగ, డోయ శ్రీనివాస్ మాదిగ, దుర్గాచలం రామాంజనేయులు మాల, తరకొండ తిరుపతి మాదిగ, కాటేదాన్ రాజు మాదిగ, మేతరి దయానంద్ మాదిగ, మరియు గ్రామ పెద్దలు యువకులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది

# మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించిన నక్క ప్రభాకర్ గౌడ్

మరో ఉదయం/జవహర్ నగర్.



జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ లోని జవహర్ నగర్ బస్ స్టాండ్ నందు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలలో ఒకటైన ఉ చిత బస్సు రవాణా ప్రయాణాన్ని ప్రారంభించిన మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నక్క ప్రభాకర్ గౌడ్. జవహర్ నగర్ బస్ స్టాండ్ నందు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ మరియు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరభిక్షేపం చేసి ఉచిత బస్సు ప్రయాణాన్ని మేడ్చల్ జిల్లా అధ్యక్షులు నక్క ప్రభాకర్ గౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఇరువై ఎనిమిదవ డివిజన్ కార్పొరేటర్ కారింగుల నిహారిక గౌడ్, జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కారింగుల శంకర్ గౌడ్, జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, నాలుగవ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు హైమా రాజు యాదవ్, జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్ల శ్రీనివాస్, మాట్ల వినయ్ మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ కోలుకుంటున్నారు..

మొదటి పేజీ తరువాయి

## అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనాలని కోరాను: రేవంత్ రెడ్డి

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. సోమాజిగూడలోని యశోద ఆసుపత్రికి వెళ్లిన రేవంత్ రెడ్డి కేసీఆర్ ను కలిశారు. ఆయనను పరామర్శించారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి కేటీఆర్, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి వెలుపల మీడియాతో మాట్లాడుతూ... కేసీఆర్ ను పరామర్శించానని తెలిపారు. ఆయన క్రమంగా కోలుకుంటున్నారని చెప్పారు. కేసీఆర్ ఆరోగ్యం కోసం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని చీఫ్ సెక్రటరీని ఆదేశించానని తెలిపారు. కేసీఆర్ త్వరగా కోలుకుని అసెంబ్లీకి రావాలని ఆకాంక్షిస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలో మంచి పాలన అందించడానికి... ఆయన సూచనలు కూడా అవసరం అని అన్నారు. ప్రజల పక్షాన అసెంబ్లీలో కేసీఆర్ మాట్లాడాల్సిన అవసరం ఉందని చెప్పారు. త్వరగా కోలుకుని అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనాలని కేసీఆర్ ను కోరానని తెలిపారు.

# సినిమాటోగ్రఫీ మంత్రిగా బాధ్యతలు చేపట్టాక దిల్ రాజు తప్ప సినిమా వాళ్లెవరూ ఫోన్ చేయలేదు: కోమటిరెడ్డి

నల్గొండ అసెంబ్లీ బరిలో గెలిచిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

సినిమాటోగ్రఫీ, ఆర్ అండ్ బి మంత్రిగా నేడు బాధ్యతల స్వీకరణ

ఇవాళ కీలక ఫైళ్లపై సంతకాలు చేసినట్టు కోమటిరెడ్డి వెల్లడి



నల్గొండ అసెంబ్లీ బరిలో దిగి ఎమ్మెల్యేగా విజయం సాధించిన కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి మంత్రివర్గంలో చోటు లభించిన సంగతి తెలిసిందే. ఆయనకు సినిమాటోగ్రఫీ, ఆర్ అండ్ బి శాఖలు అప్పగించారు. ఇవాళ ఆయన మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. సచివాలయంలోని తన చాంబర్ లో వేద పండితుల ఆశీర్వచనాల మధ్య మంత్రిగా తన కార్యకలాపాలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తాను సినిమాటోగ్రఫీ మంత్రిగా బాధ్యతలు చేపట్టాక సినీ రంగం నుంచి దిల్ రాజు తప్ప మరెవరూ ఫోన్ చేయలేదని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. తనకు మంత్రి పదవి ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని వెల్లడించారు. ఇవాళ పలు కీలకమైన ఫైళ్లపై సంతకాలు చేసినట్టు తెలిపారు. కాగా, వెంకట్ రెడ్డి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ఆయన సోదరుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా హాజరయ్యారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మునుగోడు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు.

# లింగంపల్లి ప్రభుత్వ దవాఖానాలో ఆరోగ్యశ్రీ పథకం ప్రారంభం!

శేరిలింగంపల్లి, మరో ఉదయం న్యూస్ డిసెంబర్ 10

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అలాగే చేయూత పథకంలో భాగంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సహాయం కింద 10 లక్షలను అందించడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇంచార్జ్ కంటెస్టెంట్ ఎమ్మెల్యే వాలిదాసు జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. శనివారం నాడు రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి శాసనసభ ఆవరణలో ప్రారంభించిన తర్వాత శేరిలింగంపల్లి ప్రభుత్వాసుపత్రిలో నేడు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. రంగారెడ్డి జిల్లా అడిషనల్ కమిషనర్ ప్రతిమాసింగ్, ఇతర ఉన్నత అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియమ్మ జన్మదినం సందర్భంగా మహాలక్ష్మి పథకాన్ని లింగంపల్లి బస్ డిపోలో ప్రారంభించగా, చేయూత పథకాన్ని లింగంపల్లి ప్రభుత్వ దవాఖానలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కాంగ్రెస్ పార్టీ కంటెస్టెంట్ ఎమ్మెల్యే జగదీశ్వర్ గౌడ్, ఇతర అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.







SUN - M U_SAT - M U.qxd 10-12-2023 11:06 PM Page 3



# ముగ్గురు మొనగాళ్లు మూడు మంత్రి పదవులు

# ఇది ! ఖమ్మం కాంగ్రెస్ గడ్డ అంటే....

హర్షం వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు.

ముగ్గురు మంత్రులు కు శుభాకాంక్షలు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు.

జూలూరుపాడు డిసెంబర్ 10

మరో ఉదయంప్రతినిధి.

ఉ మ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు వైరా నియోజకవర్గ ప్రజలకు జూలూరుపాడు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఆనందాలకు అవధులు లేకుండా పోయాయి మొదట ఎమ్మెల్యేలను అత్యధిక మెజారిటీతో గెలిపించిన ఆనందం ఒకటి తెలంగాణ రాష్ట్రంలో సంపూర్ణ మెజారిటీతో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన ఘనత ఉమ్మడి జిల్లాలో 90 శాతం సీట్లు సాధించిన ఆనందం అన్నిటికి మించి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ముగ్గురు కు మంత్రి పదవి ఇచ్చి ముఖ్యమంత్రి శ్రీ ఎనుమల రేవంత్ రెడ్డి వైరా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు టిడిపి పార్టీ కార్యకర్తలకు సిపిఐ సిపిఎం కార్యకర్తలకు ఎంతో ఆనందాన్ని మిగిల్చారు ఇదంతా ఖమ్మం జిల్లాలో ప్రజలు త్రిమూర్తులుగా భావిస్తున్న పాలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖమ్మం ఎమ్మెల్యే తుమ్మల నాగేశ్వరావు మదిర ఎమ్మెల్యే బట్టు విక్రమార్క మల్లు వీరి ముగ్గురిపై ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రజలు పెట్టుకున్నా ఆశలు ధైర్యం నమ్మకంగా భావిస్తున్నారు ఆ నమ్మకానికి ఫలితంగా జిల్లాలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలని వాళ్ళ ముగ్గురు ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపి పార్టీ కోసం పనిచేసే ప్రజలకు అందుబాటులో ఉండి అధికార పార్టీ బెదిరింపులకు లొంగక జిల్లాలో ఒక టీం గా ఏర్పడి ప్రజలకు మేమున్నాం మనకు ధైర్యం కలిగేవరకు పోరాడి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్ పార్టీకి ఒక మూల స్తంభాల ల నిలబడి పార్టీకి పూర్వవైభవం తెచ్చిన ఘనత ఈ ముగ్గురికి దక్కింది పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి ఓపిక పట్టుదల కృషి భట్టి విక్రమార్క పై ఉన్న నమ్మకం అని తుమ్మల నాగేశ్వరావు మీద ఉ న్న సీనియారిటీ అని ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు భావిస్తున్నారు ఈ ముగ్గురు కష్టం పలించి తొమ్మిది నియోజకవర్గ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మెజారిటీకి దోహదపడ్డారని, వారి కృషి ఫలితం వారి మీద ఉన్న నమ్మకం తో అధిష్టానాన్ని ఒప్పించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడు మంత్రి పదవులు పొంగిలేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటి నుండి కాంగ్రెస్ పార్టీకి ఇచ్చిన మాట కోసం అపర భగీరథ ప్రయత్నం గా గుర్తించి రెవిన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి గా కాంగ్రెస్ పార్టీ కోసమే పుట్టారు అన్న నమ్మకంతో కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ భట్టి విక్రమార్క కు ఉప ముఖ్యమంత్రి తో పాటు ఆర్థిక శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మంలో ఉన్న రాజకీయ అనుభవాన్ని వ్యవసాయ చేనేత శాఖ మంత్రిగా గుర్తించి పదవులు కట్టబెట్టారని ఆనందంలో పొంగిపోయారు ఈ ఆనందానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు వై రా నియోజకవర్గం మరియు జూలూరుపాడు మండలం ప్రజలు కాంగ్రెస్ పార్టీ దాని మిత్రపక్షాల కార్యకర్తలు అభిమానులు ఇచ్చిన ఓట్ల రూపంలో పార్టీతో పంచుకున్న





ప్రేమగా భావించాలి ఈ ఆనందాన్ని ఐదు సంవత్సరాలు ఇదేవిధంగా మంచి పరిపాలనతో అందరికీ సంక్షేమ పథకాలు అందించి అందరి మనసులో కాంగ్రెస్ పార్టీకి చెరగని ముద్ర వేసే విధంగా అడుగులు వేయాలని కాంగ్రెస్ మండల నాయకులు కార్యకర్తలు అభిమానులు కోరారు

## నేడు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభం

## మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా వెల్లడి

ప్రజల సమస్యలు ప్రజావాణిలో

తెలుపగలరు కలెక్టర్ విజ్ఞప్తి

మెదక్ ప్రతినిధి మరో ఉదయం డిసెంబర్ 10

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రేపటి నుండి అనగా తేదీ: 11.12.2023 సోమవారం నుండి యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికల -2023 నిర్వహణ నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని తెలిపారు.

ప్రస్తుతం శాసనసభ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున రేపటి సోమవారం నుండి యధావిధిగా ఐ డి ఓ సి లోని సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటల నుండి ప్రజావాణి కార్యక్రమం తిరిగి నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ వినతులను అధికారులకు అందజేసి పరిష్కారం పొందవలసినదిగా జిల్లా కలెక్టర్ సూచించారు.

## సాబీర్ పాష ను కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి మరో ఉదయం డిసెంబర్ 10

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.. సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి %ాఖ% సాబీర్ పాష ను కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి %ుపీ=ాూ% రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండా రమేష్. %ుపీ=ాూ% పాల్వంచ పట్టణ అధ్యక్షులు పోతురాజు గణేష్. %ుపీ=ాూ% పాల్వంచ మండల నాయకులు. పడిగల కోటేశ్వరరావు. రామారావు. సుందరం. తదితర నాయకులు పాల్గొన్నారు..



# పాలకుర్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యం

- ఎర్రబెల్లి ఎన్ని జిమిక్కిలు చేసిన కాంగ్రెస్ వైపే పాలకుర్తి ప్రజలు.
- భారీ మెజార్టీతో గెలిపించిన పాలకుర్తి ప్రజలకు రుణపడి ఉంటా.
- పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి.
- ప్రమాణ స్వీకారం తర్వాత తొలిసారి ఎమ్మెల్యేగా నియోజకవర్గానికి వచ్చిన యశస్వినికి ఘన స్వాగతం.

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి (తొర్రూరు) డిసెంబర్10 (మరో ఉదయం):

పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంచి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యం అని పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. ఆదివారం పాలకుర్తి ఎమ్మెల్యేగా గెలిచిన మామిడాల యశస్విని రెడ్డి మొట్ట మొదటిసారిగా తొర్రూర్ పట్టణ కేంద్రానికి విచ్చేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ గజమాలలతో సత్కరించి ఘన స్వాగతం పలికి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డితో కలిసి యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. పాలకుర్తిలో తనను ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించిన పాలకుర్తి ప్రజలకు రుణపడి ఉంటానని అన్నారు. నియోజకవర్గంలో ఎన్నడు జరగని విధంగా అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఎర్రబెల్లి దయాకర్ రావు ఎన్ని జిమ్మిక్కులు చేసినా పాలకుర్తి నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ వైపే నిలిచారని, పాలకుర్తిలో నిరంకుశ, నియంతృత్వ పాలన అంతం అయిందని, ప్రజలకు విముక్తి లభించిందని, ఓటమి ఎరుగని ధీరుడని గొప్పలు చెప్పుకునే దయాకర్ రావుకు పాలకుర్తి ప్రజలు తగిన గుణపాఠం చెప్పి చిత్తు చిత్తుగా ఓడించారని, పాలకుర్తి నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడానికి వస్తే తమ కుటుంబ సభ్యులను ఎర్రబెల్లి అధికార అహంకారంతో భయభ్రాంతులకు గురి చేశాడని విమర్శించారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులకు అనేక విధంగా ఇబ్బందులకు గురి చేశాడని, ప్రజలను మాయమాటలతో మభ్య



పెట్టాలని చూసినా, ఎన్నో రకాల ప్రలోభాలకు గురి చేసినా, డబ్బు, మద్యం ఎరజూపినా కూడా పాలకుర్తి ప్రజలు ఎర్రబెల్లికి సరైన గుణపాఠం చెప్పి పాలకుర్తి నుండి తరిమి కొట్టారని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందకుండా చేసి సొంత పార్టీ కార్యకర్తలకు మాత్రమే లబ్ధి చేకూర్చిన ఎర్రబెల్లిని చిత్తు చిత్తుగా ఓడించారని, అరాచక పాలనకు అంతం చేసి ప్రజాపాలనకు పట్టం కట్టి మంచి పాలన చేసే కాంగ్రెస్ పార్టీకి పాలకుర్తిలో ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించిన పాలకుర్తి ప్రజలకు, కాంగ్రెస్ కార్యకర్తలకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీ కార్డులు ప్రజలకు చెందే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ టీపీసీసీ సభ్యుడు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ కాకిరాల హరి ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్, తొర్రూరు, పెద్దవంగర మండలాల అధ్యక్షుడు సుంచు సంతోష్, ముదసాని సురేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ అనుమండ్ల నరేందర్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు భూసాని రాము, కాంగ్రెస్ జిల్లా నాయకులు పెదగాని సోమయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మి నరసింహ స్వామీని దర్శించుకున్న పాలకుర్తి ఎమ్మెల్యే "

(దేవరుప్పుల డిసెంబర్ 10మరో ఉదయం)

పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొంది కార్యకర్తల జనసందోహంతో భారీ ర్యాలీగా తొలిసారిగా పాలకుర్తి మండల కేంద్రానికి విచ్చేసి ప్రముఖ ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రమైన కోరిన కోర్కెలు తీర్చే స్వయంభు శ్రీ చండికా సమేత సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి,వారి కుటుంబ సభ్యులు అనంతరం దేవస్థానం వేదపండితులు నూతన ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డికి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించి శేష వస్త్రాలు అందించి ఆశీర్వచనం అందించారు ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ మండలం అధ్యక్షులు యువ నాయకులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



## మండల అధ్యక్షుడు బొడ్డు కృష్ణయ్య గుండె నొప్పితో హాస్పిటల్లో చేరిక

జూలూరుపాడు మండలం డిసెంబర్ 10 మరో ఉదయం ప్రతినిధి

జూలూరుపాడు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొడ్డు కృష్ణయ్య గుండె నొప్పితో హైదరాబాదు ప్రైవేట్ హాస్పిటల్ లో చేరినట్టు సమాచారం డిసెంబర్ 9 శనివారం మధ్యాహ్నం జరగబోయే వైరా అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ ప్రమాణస్వీకారం సందర్భంగా అదే రోజు తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో హైదరాబాదుకు కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి హైదరాబాద్ వెళ్లారు ప్రమాణస్వీకారం కార్యక్రమం ఆయన కొంత సమయానికి ఎమ్మెల్యే రామదాసును కలవడం జరిగింది శుభాకాంక్షలు తెలిపి తిరిగి మళ్లీ ఇంటికి బయలుదేరిన కొద్ది సమయానికి వస్తుండగా బయలుదేరిన కొద్దిసేపటికి అకస్మాత్తుగా గుండె నొప్పి రావడం ఆయాసంతో అపస్మారక స్థితిలోకి వెళ్లారు హుటాహుటిన దగ్గర్లో ఉన్న %ుశ% హాస్పిటల్లో చేర్పించారు వైద్యులు పరీక్షించి గుండెనొప్పి తో పాటు మూత్రపిండాల పనితీరు సరిగా లేవని తెలిపారు కృత్రిమ పద్ధతిలో మూత్రపిండాలు పనితీరును పెంచి గుండెకు సంబంధించిన శాస్త్ర చికిత్స చేయవలసి వస్తుందని వైద్యులు సూచించడంతో హాస్పిటల్లో అడ్మిట్ అయి ఉన్నారు. జూలూరుపాడు మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ కి ఎన్నో రకాల సేవలు అందించారని వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే రామదాసు ఆసుపత్రి వైద్యులకు ఫోన్ చేసి కృష్ణయ్య యోగక్షేమాలు తెలుసుకొని కృష్ణయ్యకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు మండల నాయకులు జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆసుపత్రికి చేరుకొని బొడ్డు కృష్ణయ్యను పరామర్శించారు కృష్ణయ్య త్వరగా కోలుకోవాలని కోరారు

## మహిళలకు ఉచిత బస్ ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

మరో ఉదయం మానకొండూర్

మహిళలకు ఉద్దేశించి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సును ఆదివారం మానకొండూరు శాసనసభ్యుడు డా. కవ్వంపల్లి సత్యనారాయణ మానకొండూర్ మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణంలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. అందులో భాగంగానే మానకొండూర్ నియోజకవర్గ కేంద్రంలో ఉచిత ఆర్టీసీ బస్ కు ప్రారంభించడం జరిగిందన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సులలో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చన్నారు. ఏదైనా గుర్తింపు కార్డు చూపిస్తే వారు ఆర్టిసి బస్సులలో ఎక్కడ నుంచి ఎక్కడ వరకు అయినా సరే ఉచితంగా ప్రయాణం చేసే వెసులుబాటు ఈ పథకం ద్వారా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్,జడ్పీ సీఈవో పవన్,మండల పరిషత్ అధ్యక్షురాలు ముద్దసాని సులోచన శ్రీనివాస్ రెడ్డి,లి లిడిటి సీవో డా.రవీందర్ రెడ్డి,వైద్యాధికారి డాక్టర్ గోపాల్, డా.ప్రణవ్ తోపాటు ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు



## తెలంగాణలో"అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం"

- వికలాంగుల మండల సమైక్య ఆధ్వర్యంలో.. కార్యక్రమం

కోహెడ డిసెంబర్.10 (మరో ఉదయంన్యూస్):

"అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ" వారోత్సవాలలో భాగంగా.. ఆదివారం కోహెడ మండల పరిధిలోని గ్రామాల వికలాంగులు, డిసెంబర్ 10 నా "అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం" వేడుకను, వెన్నెల వికలాంగుల మండల సమైక్య సంఘం అధ్యక్షుడు చిట్యాల సంపత్, కమిటీ సభులందరి సమక్షంలో నిర్వహించారు. అనంతరం ఇటీవల నూతన రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి బాధ్యతలు చేపట్టిన అనుముల రేవంత్ రెడ్డి గారికి, వికలాంగుల మండల కమిటీ తరుపున శు భాకాక్షలు తెలిపారు. ఎన్నికలలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన "అభయ హస్తం" "మేనిఫెస్టోలో 29 వ హామీగా" దివ్యాంగుల సంక్షేమంలో.. భాగంగా ప్రవేశపెట్టిన వాటిని, తొందరగా అమలులోకి తీసుకురావాలని సీ.ఎం రేవంత్ రెడ్డి నీ ఈ సందర్భంగా వికలాంగులు కోరారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల నాయకులు దొమ్మట కృష్ణారెడ్డి, బ్రహ్మచారి కోహెడ దుంబాల వేణుగోపాల్, గాజుల శ్రీశైలం, వెంకటేశ్వర్లు, ఇటవేణి చంద్రయ్య, బండ రాజు, పాము ప్రభాకర్, రంగు సతీష్, అప్పిస రాజయ్య, తదితర వికలాంగులు ఉన్నారు.



SUN - M U_SAT - M U.qxd 10-12-2023 11:06 PM Page 4



# కలెక్టర్ నుండి ఏఎన్ఎం దాకా నిర్బంధమే..!

## షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్"

**కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది బాధపడకండి**

**'ఆరోగ్యశ్రీ' పరిమితి రూ.10 లక్షలు**

**1383 రోగాలకు చికిత్సలు, సర్జరీలు**

**289 రుగ్మతలకు వర్తింపు**

**పరిమితి పెంపు కార్యక్రమ ప్రారంభంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు**

**హాజరైన మాజీ ఎమ్మెల్యే సి.ప్రతాప్ రెడ్డి, జెడ్పీటీసీలు**

షాద్ నగర్, డిసెంబర్10 (మరో ఉదయం):

గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కలెక్టర్ నుండి ఏఎన్ఎం దాకా ఉద్యోగ పరంగా స్వేచ్ఛ లేక నిర్బంధమైన సేవలు అందించారని వారందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక విముక్తి లభిస్తుందని షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" అన్నారు.

రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పేదలకు వరం లాంటిదని, ఈ పథకం కింద ప్రస్తుతం ఉన్న రూ.5 లక్షల పరిమితి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలకు పెంచగా.. ఆ పెంపు అమలు కార్యక్రమాన్ని ఆదివారం రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వేంకటేశ్వర రావు, అదనపు అధికారిని డాక్టర్ జయలక్ష్మి ఆధ్వర్యంలో లాంఛనంగా ప్రారంభించారు. షాద్ నగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి ఆర్డీవో వెంకట మాధవరావు, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, స్థానిక మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, ఫరూక్ నగర్ జెడ్పిటిసి పి. వెంకట్రామిరెడ్డి కేశంపేట జడ్పిటిసి విశాల శ్రావణ్ రెడ్డి స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం 1383 రోగాలకు చికిత్సలు, సర్జరీలు, 289 వైద్య రుగ్మతలకు వరిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో పేద ప్రజలకు సరైన వైద్యం అందలేదని అన్నారు. కోవిడ్ సమయంలో వైద్య అధికారులు, సిబ్బంది సేవ చేశారే తప్ప ప్రభుత్వం సరైన విధంగా ఆదుకోలేదని విమర్శలు గుప్పించారు. తెలంగాణలో ఉద్యోగస్తులు ఉ ద్యమకారులు ప్రజలు కోరుకున్న తెలంగాణ ఇప్పుడు సహకారమైందని అన్నారు. ఉద్యోగస్తులు కూడా ఎంతో మేలు చేశారని అన్నారు. ఒక దశలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం రావడానికి ఉద్యోగస్తుల కారణం అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 85 లక్షల మందికి రాజు ఆరోగ్య శ్రీ కింద పది లక్షల రూపాయల వైద్య భరోసా కల్పిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వం దశలవారీగా ప్రజలకు దశల వారీగా అన్నీ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తామని చెప్పారు..





# 108 హోమగుండాలతో శ్రీ గండబేరుండ లక్ష్మీ నృసింహ యాగం

డిసెంబర్10 (మరో ఉదయం): బ్యూరో కోరుట్ల

కోరుట్ల పట్టణ ఆదర్శనగర్ లో గల అష్టలక్ష్మి సమేత శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో ఆదివారం శ్రీ గండబేరుండ లక్ష్మీనృసింహ యాగాన్ని 108 హోమగుండాలతో హోమ కార్యక్రమాన్ని గోవర్ధనగిరి నర్సింహచార్యులు సముద్రాల శ్రీరామాచార్యుల వైదిక నిర్వహణలో నిర్వహించారు ఇందులో భాగంగా ముందుగా విశ్వక్సేన పూజ పుణ్యాహవాచనం మహా కుంభారాధన శ్రీ గండబేరుండ లక్ష్మీనృసింహ యాగాన్ని 108 హోమగుండాలతో హోమం చేపట్టారు ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు బూరుగు రామస్వామి గౌడ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని ఇలాగే నిర్వహిస్తామని భక్తులు కూడా ఇదే విధంగా సహకరించాలని కోరారు అనంతరం హోమ కార్యక్రమంలో పాల్గొన్న భక్తుల కోసం అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని కావున భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించి శ్రీ గండబేరుండ లక్ష్మి నృసింహ స్వామి శ్రీ అష్టలక్ష్మి సమేత లక్ష్మీనారాయణ స్వామి కృపకు పాత్రులయ్యారని తెలిపారు అనంతరం హోమంలో కూర్చున్న ఆర్డిఓ రాజేశ్వర్ మాట్లాడుతూ ఇంత పెద్ద కార్యక్రమం నిర్వహించడం చాలా అభినందనీయమని ఇలాంటి కార్యక్రమాలు మున్ముందు కూడా చేపట్టాలని కోరారు ఈకార్యక్రమంలో నర్సింహ చార్యులు సముద్రాల శ్రీరామాచార్యులు అనంత ఆచార్యులు సుగుణాకరాచార్యులు సంపత్ కుమార్ ఆచార్యులు రమణాచార్యులు అజయ్ కుమారాచార్యులు కృష్ణ కాంతాచార్యులు ఇందుర్తి మధుసూదనాచారి శ్రీనివాస్ మర్రిపెల్లి రంగాచార్యులు ఆలయ నిర్వాహకులు బూరుగు రామస్వామి గౌడ్ ఆర్డిఓ రాజేశ్వర్ ఎలిశెట్టి భూమారెడ్డి ముత్యాల గంగాధర్ వెంకటేశ్వర్ రావు చిలుక గంగాధర్ చౌటుకూరు అంజయ్య గౌడ్ పురుషోత్తం సతీష్ గంగాధర్ చందు శ్రీనివాస్ వెంకట్రాములు మహేష్ మధు భక్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు



# 13 న నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం - ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్ చెరు: డిసెంబర్10 (మరో ఉదయం):

ఈ నెల 13న పటాన్చెరు నియోజకవర్గస్థాయి అభివృద్ధి సమీక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం పటాన్చెరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని స్థాయిల ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుండి చేపడుతున్న పనుల పురోగతి నూతనంగా చేపట్టబోయే అభివృద్ధి పనుల రూపకల్పనపై అన్ని విభాగాల అధికారులు, ప్రజా ప్రతినిధులతో చర్చించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరిని అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తూ ముందుకు వెళ్తామని ఆయన తెలిపారు. హాజరైన నియోజకవర్గ ప్రజాప్రతినిధులు.





# ఘనంగా తెలంగాణ ప్రధాత సోనియా గాంధీ గారి జన్మదిన వేడుకలు..

హత్నూర మండల్ డిసెంబర్10 (మరో ఉదయం):

నర్సాపూర్: యూపిఎ చైర్ పర్సన్ శ్రీమతి సోనియాగాంధీ గారి జన్మదినం సందర్భంగా నర్సాపూర్ పట్టణంలోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు పిసిసి ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి గారు. అనంతరం పట్టణంలోనీ పుర వీధుల నుండి ర్యాలీగా వెళ్లి బస్టాండ్ లో రాష్ట్ర ప్రభుత్వం నేడు ప్రారంభించిన మహిళలకు ఉచిత బస్సు కార్యక్రమాన్ని ఆర్టీసీ అధికారులతో కలిసి ప్రారంభించడం జరిగింది..

ఈ కార్యక్రమంలో నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...




# మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించిన - ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్ చెరు: డిసెంబర్10 (మరో ఉదయం):

మహిళల కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని ఆదివారం పటాన్చెరు పట్టణంలో స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మంచి చేసే పథకాలను, కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వాలు మారినంత మాత్రాన అధికారి కార్యక్రమాల సమాచారాన్ని స్థానిక ప్రజాప్రతినిధులకు ఇవ్వడంలో జాప్యం ఉండకూడదని సూచించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం మూలంగా ఆటో రంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉత్పన్నమవుతాయని, ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, డి ఆర్ డి ఎ పి డి శ్రీనివాసరావు, ఆసుపత్రి ముఖ్య అధికారి వసుంధర, ఎంపీపీలు సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి, జెడ్పిటిసిలు సుధాకర్ రెడ్డి, కుమార్ గౌడ్, మున్సిపల్ చైర్మన్లు తుమ్మల పాండురంగారెడ్డి, రోజా బాల్రెడ్డి, లలితా సోమిరెడ్డి, వైస్ చైర్మన్లు నరసింహా గౌడ్, రాములు గౌడ్, కార్పొరేటర్లు సింధు ఆదర్శ్ రెడ్డి, మెట్టు కుమార్ యాదవ్, పుష్ప నగేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం..

మహా ముత్తారం డిసెంబర్10 (మరో ఉదయం):



మహా ముత్తారం మండలం కొత్త రేగుల గూడెం,పాత రేగుల గూడెం గ్రామాల వరి ధాన్యాల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన జయశంకర్ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ లింగమల్ల శారద దుర్గయ్యా.అలాగే మీనాజీపేట గ్రామానికి చెందిన మేకల సమ్మక్కఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా దశ దినకర్మలో పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బూసి దేవేందర్ రెడ్డి,పింగిలి రవీంద్రారెడ్డి,పింగిలి మల్లారెడ్డి, మూడెత్తుల రాజు,ధాగం రమేష్, మోత్కూరు రాజు, మన్కుర్తి చందు, ఓడేటి రాజేందర్ రెడ్డి,దినేష్ మరియు తదితరులు పాల్గొన్నారు...







# తొలగించిన 26 కులాలను తక్షణమే బిసి జాబితాలో చేర్చాలి.

జగిత్యాల టౌన్ డిసెంబర్ 10(మరో ఉదయం)

ఈరోజు జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగిన బిసి సంక్షేమ సంఘం సమావేశంలో జగిత్యాల జిల్లా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో ఇచ్చిన హామీ మేరకు గత ప్రభుత్వం తొలగించిన 26 కులాలను తిరిగి బీసీ జాబితాలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. తొలగించిన 26 బీసీ కులాల పోరాట సమితి కోరిక మేరకు రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు అయిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మద్దతు తెలియజేస్తూ, 26 బీసీ కులాలను తిరిగి చేరుస్తామని కాంగ్రెస్ తమ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిందని గుర్తు చేశారు.

# మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య



రామాయంపేట డిసెంబర్10 (మరో ఉదయం):

నిజాంపేట మండల పరిధి లోని బచ్చు రాజు పల్లి గ్రామానికి చెందిన కమ్మరి నర్సింలు అనే వ్యక్తి (50) మద్యానికి బానిసై ఆర్థిక ఇబ్బందుల కారణంగా తన ఇంట్లో ఎవరు లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్ కు ఉరివేసుకొని చనిపోయినాడు అతని భార్య కమ్మరి అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని నిజాంపేట మండల పోలీసులు తెలిపారు

Printed,Published and Owned by GILAKARA SRIDHAR,Printed at M/S Kakatiya Printers,H.No.24-91/72,73,74 IDA,Uppal,Uppal Mandal,Medchal-Malkajgiri District, Telangana, Published at, H.No. 1-5-631/276,Ambedkar Colony, Old Alwal Village, Alwal Mandal, Medchal-Malkajgiri District,Telangana., Cell : 91548 42842, Editor: GILAKARA SRIDHAR RNI No. TELTEL/2016/71618., Email : maroudayam20@gmail.com